Sapiens' అనే గ్రంథంలో మానవుడి భవిష్యత్తును తలుచుకుని వెదవి విరిచాడు. యుద్ధాలతోనూ అవినీతితోనూ, రోగాలతోనూ మానవ జాతి భవిష్యత్తులో చిక్కు శల్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని వెల్సు పండితుడు నిట్టూర్చాడు. కాని, తినడానికి తిండి, పీల్చడానికి గాలి, అందరికీ చాలినంతమంది ఆడవాళ్లూ, నివాసస్థలమూ, ప్రాసురుం డుకు కాయితాలూ ఉన్నన్నాళ్లు మానవజాతి చెక్కుచెదరదని నా అభిప్రాయం.

---

## కొండపల్లి బొమ్మ

పదునైన జీవితపు టంచులమీద లాక్షారుణిత రేఖావృతమైన పదపల్లవ యుగళిని మృదువుగా మోపి ఘణఘణ మ్రోగే గజ్జల మోతతో భావ వీధుల్లో పసందుగా నాట్యమాడే ఆతొలి వికాసపు రోజుల్లో ఎక్కడో, ఏవిటో జారవిడిచి, పోగొట్టుకుని, దాని వెతుక్కుంటూన్నట్టుగా ఆ ముడతపడిన కళ్ళను బలహీనంగా మిడిలిస్తూ, ఆ పోగొట్టుకున్న దాన్ని ఎప్పుడైనా, ఎవరైనా, ఏ భావంతోనైనా తిరిగి తనకు పదిలంగా తెచ్చి యిస్తారేమోననే ఆశతో ఎదురు తెన్నులు చూస్తూన్నట్టుగా ఎప్పుడూ అలా నిలబడి వుంటుందామె.

ఆ దారిన పోయేవాళ్ళంతా ఆమెను గమనిస్తూ, రోజురోజూ గమనిస్తూ, సంవత్సరాల తరబడి గమనిస్తూ ఆమెలో ఏ విధమైన కొత్త మార్పులూ కొత్త అనుభూతులూ కొత్త సంచలనాలూ కలక్కపోవడాన్ని చూసి ఆమె వూరికే అలా ఆలోచిస్తూ నిలబడుతుందే తప్ప మరేమీ ఆమెలో లేదనే తీర్మానానికి వచ్చారు.

నిజంకూడా అంతే. ఆమె వూరికే కళ్లు వప్పగించి అలా నిలబడుతుంది. ఏమీ చెయ్యదు, ఎవరితోనూ మాట్లాడదు. ఎవర్నీ ఏమీ అడగదు. 'ఏదో పోగొట్టుకున్నాను' అనే భావాన్నికూడా ఆమె క్రమేణా మరిచిపోతూ వస్తూంది. ఎవరో తిరిగి దాన్ని తెచ్చి తనకు యిస్తారనేది

అసంభవమేనని కూడా ఆమెకు తెలుసును. ఆమెకు—వాంఛలన్నీ ఉడిగిసాయ్. వాసనలు మాత్రమే కొంచం మిలిగివున్నట్టుగా ఆమె నిముష నిముషానికీ కట్టి విప్పుతూంటే చీరలవల్ల తెలియవస్తుంది.

ఆభరణాలుకూడా అట్టే ధరించదామె. నిరాభరణసుందరి - అందాల భరిణె—కోటిపల్లి తీర్థంలో ప్రదర్శింపబడటానికి ఇప్పుడిప్పుడే అర్హత సంపాయించుకుంటూంది.

చీరలే ఆమె వ్యసనం. అన్నిఘంటలకూ అన్నిరంగులూ మారుస్తుంది. అవి కట్టుకుని అలా నించుంటుంది పొద్దస్తమానం. ఆమె ఎక్కడికీ వెళ్ళదు. కాని, ఆమెలోంచి అనుక్షణం ఏవో—ఏవేవో—స్మృతి విస్మృతి పథాల్లో తేలియాడే వెల్లువలు—లేచి అన్ని వైపులకూ ఎగిరి పోతాయి. పోయేవాటిని ఆమె పట్టుకోలేదు—పట్టుకుని ఆపలేదు. అలాంటి ప్రయత్నాలు కొన్ని ఆవిడచేసిన రోజులున్నాయి. కాని చేతులు కాల్చుకుని ఊరుకుంది. ఇప్పుడెప్పుడైనా ఆ ప్రయత్నాల సంగతి ఆమె స్మృతి పథంలో మెరిస్తే ఆమె వినోలియా కంపెనీనీ, పాండ్స్ క్రీములనూ, యీవినింగ్ ఇన్ ప్యారిస్‌నూ, అటోల్ బహారునూ తిట్టే తిట్లకు అంతుండదు.

ఒక్క చీరలే ఆమె వీక్‌నెస్—ఎప్పుడూ ఆమె అలాగే గుమ్మంలో నించుని వుంటుంది, చీరలుకట్టి విడుస్తూ. ఎప్పుడు భోంచేస్తుందో, ఎప్పుడు నిద్రపోతుందో ఎవరికీ తెలీదు.

కళ్ళు వప్పగించి మాత్రం చూస్తూంటుంది—తన చుట్టూరా వుండే పచ్చటి ప్రపంచాన్ని. అందులో తనకు కావలసిన వస్తువు లేమీ లేవని ఆమెకు తెలుసును. ఆ లేనివాటికోసం ఆమె ప్రయత్నించనూ ప్రయత్నించదు. అసలు ఆ ప్రయత్నాలమాట ఎత్తితేనే ఆమెకు వాంతి రాబోతుంది.

ఆమె ఏమీ చెయ్యదు, ఎవర్నీ ఏమీ కావాలని అడగదు, ఎవర్నీ తిట్టదు, ఎవరినీ ద్వేషించదు. వూరికే అలాగ నిలబడుతుందంతే అల వాటుచేత.

అలా నిలబడివుండే ఒక్కొక్కప్పుడు కునికిపాట్లు పడుతూంటుంది కూడాను-ఆ కునికిపాట్లలోనే స్వప్నవీధికి ఎగబ్రాకుతుంది. ఆ ఎగబ్రాకటంలో ఆమెయొక్క వెనకటి 'తీర్థపు' రోజులు ఆమె కళ్ళ ముందర మెరిసిపోతాయి.

మెళుకువ వచ్చాక మళ్ళీ కళ్ళు విప్పి చూసుకుంటుంది. 'ఆనాటి' సరంజాంలోది ఒక్క చీర తప్ప మరేమీ మిగలదు. అంతా అదృశ్యమై పోతుంది. మళ్ళా కళ్లు వప్పగించి అలా చూస్తూవుంటుంది, తన చుట్టురావుండే ప్రపంచాన్ని.

మీ రెప్పుడైనా చూశారో లేదో-కోటిపల్లి తీర్థం అయిపోయిన తొన్నాళ్ళవరకూ కూడా ఒక్కొక్క పాక ఇంకా మిగిలివుంటుంది. బొమ్మలనన్నిటినీ సొమ్ముచేసుకున్న ముచ్చి ఆ పాకను విప్పడం దండుగని చెప్పి దాన్నక్కడ విడిచేసిపోతాడు. వెతకడానికి ఓపికవుంటే, ఆ పాకలో ఏమూలనో అతడు విడిచివెళ్ళిన ఒకరంగు రాలిపోయిన బొమ్మకూడా కనబడుతుంది. ఆ బొమ్మ అలా చూస్తూ నించోవడంతప్ప మరేంచేస్తుందీ ? ? ?

## హక్కులూ, హద్దులూ . . .

'మీరు మీచేతిని జాపుతే అది ఎక్కడైతే అంతమవుతుందో అక్కడ ప్రక్కవాడి ముక్కు ప్రారంభమవుతుంది మీరు మీ చేతిని జాపడంలో ప్రదర్శించే హక్కువంటిదే ప్రక్కవాడి ముక్కుకు కూడా వుంటుంది. ఈ సత్యాన్ని మీరు గ్రహించి మీ సరిహద్దులలో మీ చేతిని యథేచ్ఛగా సంచరింపనిస్తూ ప్రక్కవాడి ముక్కునుకూడా దాని సరిహద్దులలో దాన్ని స్వేచ్ఛగా ప్రవర్తింపనివ్వాలి. ఇందుకు మీరు ఏవిధమైన ఆక్షేపణ, అభ్యంతరం చూపకూడదు. ఇలాచేస్తే మీచేతికీ వాడి ముక్కుకూ మధ్య ఏవిధమైన ప్రతిష్టంభనా ఏర్పడకుండా పరిస్థితులు సజావుగా సాగుతాయి...'